వెన్నుపోట్లు చంద్రబాబుకు అలవాటే

- వెన్నుపోటు దినం ర్యాలీలో నినదించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు
- పథకాలు అమలు చేయాలని డిమాండ్



నందిగామలో ర్యాలీ చేస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు



పేట నిరసన ర్యాలీలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీ శ్రేణులు

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ మండిపడ్డారు. కూటమి పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నందిగామలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా కక్షలు, కుట్రలు, అరాచకాలు, కుతంత్రాలు, అక్రమ కేసులతోనే నడించిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలుచేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనత కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు.

బాబుది విధ్వంసపాలన...

రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్సీ అరుణకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓట్ల లెక్కింపు జరుగుతుండగానే టీడీపీ గూండాలు రోడ్లపై పడి కర్రలు, గడ్డపారలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేయడం విధ్వంసక పాలన కాక మరేమిటి? అని ప్రశ్నించారు. దేశచరిత్రలో ఎక్కడా ఎన్నడూలేని విధంగా విలేకరులు, న్యాయవాదులపై అక్రమ కేసులు మోపిన ఘనత కూటమి ప్రభుత్వానికి, నందిగామ ఎమ్మెల్యేకే దక్కిందని గుర్తుచేశారు.

పవన్‌కల్యాణ్ ఎందుకు ప్రశ్నించరు?...

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని మాజీఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. అన్యాయం, అక్రమాలను ప్రశ్నిస్తానని ఎన్నికలకు ముందు చెప్పిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అన్యాయాలపై ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే సహించబోనన్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రస్తుతం రాష్ట్రంలో ఆడబిడ్డలపై రోజుకో ఘటన జరుగుతున్నా నోరు మెదపలేని నిస్సహాయ స్థితిలో ఎందుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నయవంచన చేస్తున్నా, పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నోరు మెదపాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు మహ్మద్‌మస్తాన్, మంచాల చంద్రశేఖర్, వేమా సురేష్‌బాబు, బండి మల్లికార్జునరావు, కందుల నాగేశ్వరరావు, ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, కోటేరు ముత్తారెడ్డి, ఎంపీపీ మలక్ బషీర్, నాయకులు షహనాజ్ బేగం, శాఖమూరు వెంకటకుమారి, వెలగపూడి వెంకటేశ్వరరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చింతా రవి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసంద్రంగా మారిన నందిగామ

నందిగామరూరల్: నందిగామలో బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి భారీగా తరలి వచ్చిన జనంతో నందిగామ జనసంద్రంగా మారింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీఎత్తున తరలివచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ జగన్‌మోహనరావు, డాక్టర్ అరుణకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన భారీ ర్యాలీ స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం నుంచి సీఎం రోడ్డు, రైతుపేట మీదుగా కోర్టు రోడ్డు, చేపల మార్కెట్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. మహిళలు, యువత, రైతులతోపాటు అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వ అసమర్థపాలనపై నినదించారు. ఇచ్చిన హామీలను అమలుచేయాల్సిందేనని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు స్లోగన్స్ ఇస్తూ నాయకులు, కార్యకర్తలను ఉత్సాహపరిచారు. నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు పాములపాటి రమేష్, నల్లమల్లి మురళి, షేక్ యాకుబ్‌అలీ, వేల్పుల రమేష్, వేమూరి ఆదాం, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందిగామ : వెన్నుపోటు దినం ర్యాలీలో కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు

నందిగామలో వాటాల పాలన..

నందిగామలో కూటమి ప్రభుత్వ పాలన అవినీతి సొమ్ములో వాటాల పాలనగా మారిందని అరుణకుమార్ ఎద్దేవా చేశారు. నాలుగు మండలాలకు నలుగురిని నియమించి రేషన్ బియ్యం, ఇసుక దందా, లిక్కర్, గ్రావెల్ ద్వారా అక్రమార్జనకు పాల్పడుతున్న విషయం నియోజకవర్గ ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని షాడో ఎమ్మెల్యేల పనితీరుతో ప్రజలు విసుగు చెందుతున్నారని చెప్పారు. పాలన ఎలా ఉందో.. ఎవరి చేతుల్లో ఉందో.. ప్రస్తుత ఎమ్మెల్యే పాలన ఎలా సాగిస్తున్నారో కూటమి నాయకులే కథలు.. కథలుగా చెప్పుకుంటున్నారని విమర్శించారు.

కూటమి వైఫల్యాలపై దద్దరిల్లిన పేట



వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన అంతా అక్రమ అరెస్టులు, కక్ష సాధింపు చర్యలు, దౌర్జన్యాలతోనే గడిచిపోయిందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పార్టీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల హామీలను కూటమి నాయకులు అమలుచేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు ప్లకార్డులు చేబూని నిరసన ర్యాలీ చేశారు. కోదాడ రోడ్‌లోని వైఎస్సార్ సీపీ ఆఫీసు నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ పాత మున్సిపల్ ఆఫీసు కూడలి, రైతు బజారు, నెహ్రూచౌక్, బలుసుపాడు సెంటర్, అప్సరా థియేటర్ రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఎన్నికల హామీల అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నేతలు ,తహసీల్దార్ కార్యాలయంలోని ఎన్నికల డీటీ రాధికకు వినతిపత్రం అందజేశారు.

సూపర్ సిక్స్‌కు మంగళం...

ఈసందర్భంగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడారన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో కూటమి నేతలంతా కలిసి మహిళలు, నిరుద్యోగ యువత, ప్రజలందరినీ మోసం చేశారన్నారు. సంక్షేమ పథకాలు అందక జనం ఇబ్బందిపడుతుంటే, ఏడాది పాలనను పండుగలా జరుపుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేర్కొనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

ఈ పోరాటం ఆగదు...

సూపర్ సిక్స్ పథకాలతోపాటు 143 సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలుచేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిపనులను సైతం విమర్శించిన సీఎం చంద్రబాబు, ఏడాది ఆయా పథకాలను అమలుచేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. మాజీ సీఎం జగన్‌పై కోపంతో ప్రజలకు పథకాలను ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులతో ప్రజలను వేధించడం, జైలులోనే నాయకులను అంతమొందించాలనే లక్ష్యంతో డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందన్నారు. ఎన్నికల హామీలను అమలుచేసే వరకు కూటమి ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, రాష్ట్ర బీసీసెల్ ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, రైతువిభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ, రాష్ట్ర యూత్ సెక్రటరీ శివరాత్రి పృథ్వీరాజ్, పార్టీ జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ (ఏటిపట్టు గ్రామాలు) మండలాల అధ్యక్షులు బూడిద నరసింహారావు, గుత్తా శంకర్, పొన్నం కోటేశ్వరరావు, రేఖా శ్రీనివాసరావు, వత్సవాయి ఎంపీపీ కొలుసు రమాదేవి, పెనుగంచిప్రోలు జెడ్పీటీసీ ఉట్ల నాగమణి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు నాగబాబు, షేక్ జుబేర్, రూప్లానాయక్, మల్లేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు కొమ్మినేని రవిశంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏడాది పాలన..అంతా నయవంచన

జగ్గయ్యపేటఅర్బన్/నందిగామ రూరల్ : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా నయవంచనతోనే పూర్తయింది. తల్లికి వందనం, నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ అంటూ ఎన్నికల సమయంలో నోటికొచ్చినట్లు హామీలు గుప్పించిన కూటమి పాలకులు.. అధికారం చేపట్టి ఏడాది గడిచినా కూడా ఈ పథకాలను అమలుచేయకపోవడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలకు సైతం వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం తీరుపై వైఎస్సార్ సీపీ బుధవారం జగ్గయ్యపేట, నందిగామల్లో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీల్లో నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. వారి అభిప్రాయాలు వారి మాటల్లో....

కూటమి మోసం చేసింది



సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం మహిళలను దారుణంగా మోసం చేసింది. ఉచిత బస్సు. తల్లికి వందనం, విద్యా దీవెన అంటూ చెప్పి ఏదైనా ఏ పథకాన్ని అందించడం లేదు. ఇకనైనా పథకాలు అందించి ఆదుకోవాలి.

మాదుగల నాగరత్నం, గంపలగూడెం... గంద్రాయి

నిరుద్యోగ భృతి ఏదీ?



ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నాయకులు నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఈ పథకంపై ఇప్పటివరకు ఎటువంటి మార్గదర్శకాలు లేవు. ప్రతి నిరుద్యోగికి భృతి కింద నెలకు రూ.3వేలు చెల్లించాలి.

మెండెం రామారావు, పెనుగంచిప్రోలు

రైతులను నిండా ముంచారు..



సీఎం చంద్రబాబును నమ్మి రైతులు నిండా మునిగారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోకపోవడంతో పెట్టుబడి ఖర్చులకు కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పొరుపల్లి హరిబాబు, లింగాలపాడు

క్లుప్తంగా

దివ్యాంగుల కోసం ర్యాంపు ఏర్పాటు



పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం ఆలయంలోని బేడా మండపం నుంచి ప్రత్యేకంగా ర్యాంపును ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులు ఆలయంలోకి వీల్‌చైర్ ద్వారా వెళ్లేందుకు వీలుగా ఈ ర్యాంపు ఏర్పాటు చేసినట్లు బుధవారం ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలయ ఏఈ రాజు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

పెనుగంచిప్రోలు: స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బుధవారం మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యస్వామి ఉపాధ్యాయులతో ఆసనాలు వేయించగా, సౌజన్యశ్రీ మాట్లాడుతూ ప్రాణాయామం, ధ్యానంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎంఈఓ డి.రవీంద్ర మాట్లాడుతూ యోగా డేలో విద్యార్థులంతా పాల్గొనేలా చూడాలన్నారు. పీడీలు రమణ, బాబూప్రసాద్, పీఈటీ మోహనలక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 19వవార్డులో అమ్మాణి కళాశాల నుంచి శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వరకు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని 22, 19వవార్డుల్లో బుధవారం ఆయన పర్యటించి, వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ, తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్లు, హ్యాండ్ బోర్లు తదితర పలు సమస్యలను గుర్తించి, ఆయా సమస్యల పరిష్కారానికి ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశాల జారీచేశారు. అమ్మాణి కళాశాల నుంచి శ్రీముత్యాలమ్మ ఆలయం వరకు శిథిలమైన రోడ్డును పరిశీలించి రిలేయర్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. వార్డు కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, నూకల సాంబశివరావు, మున్సిపల్ ఏఈ ప్రవీణ్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సీపీ తాజుద్దీన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీతో సీఐ వాగ్వాదం



నందిగామటౌన్: నందిగామ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు బుధవారం ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, సీఐ వైవీఎల్ నాయుడుకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. వెన్నుపోటు దినం ర్యాలీలో రిక్షాకు ఏర్పాటు చేసిన మైక్‌ను తొలగించాలంటూ సీఐ నాయుడు రిక్షాను పక్కకు తీశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ అరుణకుమార్ మైకు ఎందుకు తొలగిస్తున్నారని సీఐని అడిగారు. డీజేగా పరిగణిస్తున్నందున తొలగించాలని సీఐ అనగా, సైకిల్ రిక్షాపై పెట్టిన సౌండ్‌బాక్సులను డీజేగా ఎలా పరిగణిస్తారని అరుణకుమార్ గట్టిగా ప్రశ్నించారు. దీంతో సీఐ వెనక్కి తగ్గారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు మైక్‌తో ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు.

రమణ ఘాట్ వద్ద నివాళులు

కంచికచర్ల: మాజీమంత్రి దేవినేని వెంకట రమణ వర్ధంతిని టీడీపీ నాయకులు బుధవారం జరుపుకున్నారు. ముందుగా రమణ, ప్రణీతల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కంచికచర్ల సమీపంలో రమణ ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళాలు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలు అందించారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన దోనెపూడి వెంకటబాల కోటేశ్వరరావు ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.10వేలు, గోవుల సంరక్షణకు రూ.15వేలు ఇవ్వగా, వేమూరి అరవింద్, నీహారిక దంపతులు గోవుల సంరక్షణకు రూ.5వేలు ఈవో కిషోర్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరణ

నందిగామరూరల్: గోవధ నిషేధిత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆర్డీవో బాలకృష్ణ ఆదేశించారు. గోవధ నిషేధంపై తన కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గోవధ నిషేధ గోడపత్రికలను ఆవిష్కరించారు. బక్రీద్ పండుగను గోవధ చట్టాన్ని ఉల్లంఘించకుండా ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, ఎంపీవీ పూర్ణిమ, అధికారులు పాల్గొన్నారు.